నష్టపోనీయం...కష్టపడనీయం...

- మూసీ నది పునరుజ్జీవానికి సహకరించండి
- పరివాహక ప్రాంత పేదలకు సిఎం రేవంత్‌రెడ్డి పిలుపు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

మూసీనది పరివాహక ప్రాంత పేద ప్రజలను నష్టపోనీవ్వం...కష్టపడనీవ్వమని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి భరోసా ఇచ్చారు. మూసీనది అంటే ముగ్గురు అన్నట్టుగా తయారైందని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే మూసీనది పునరుజ్జీవనానికి పేదలు సహకరించాలని కోరారు. మహానగరంలో మహా మామయగాళ్లు ఉంటారని, వారి మాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు. మాయమాటలు చెప్పి ప్రభుత్వ భూములను అగ్గువ, సగ్గువకు అమ్మితే కొనవద్దని సూచించారు. పేదలకు ఎలా మేలు చేయాలో సూచించాలని కోరారు. హైదరాబాద్ అంబర్‌పేటలో పునరుద్ధరించిన బతుకమ్మ కుంట చెరువును ముఖ్యమంత్రిరేవంత్‌రెడ్డి ఆదివారం ప్రారంభించారు. అనంతరం చెరువులో బతుకమ్మలు వదిలి గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే కాలేర్ వెంకటేష్ అధ్యక్షతన నిర్వహించినసభలో ముఖ్యమంత్రి మాట్లాడారు.

చెరువులో బతుకమ్మలు వదులుతున్న సిఎం రేవంత్‌రెడ్డి

ఆడబిడ్డలను మన సంతోషంలో భాగస్వాములను చేసినప్పుడే బతుకమ్మ పండుగకు నిండుదనం వస్తుందని అభిప్రాయపడ్డారు. మాజీ ఎంపి వి.హనుమంతరావు తన జీవితాశయంగా ఈ కుంట విముక్తి కోసం పోరాడారని గుర్తు చేశారు. హైడ్రా ఏర్పాటు చేసినప్పుడు కొంతమందికి అర్థం కాలేదని, మరికొంత మందికి అర్థమైనా కబ్జాలను కాపాడుకునేందుకే ప్రయత్నం చేశారని విమర్శించారు. వర్షం వస్తే గంటలో మూసీ పరివాహక కాలనీలు జలమయమవుతున్నాయన్నారు. భవిష్యత్తులో ప్రకృతి వైపరీత్యాలనుతట్టుకునేలామనం అభివృద్ధి చేసుకోవాలన్నారు.

ఒకప్పుడు జీవధారగా ఉన్న మూసీ ఇప్పుడు మురికి కూపంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. చెరువులను విడిపించడం, నాలాలను విస్తరించడం, మూసీ పునరుజ్జీవనం చేయడం తమ ప్రభుత్వం లక్ష్యమని పునరుద్ఘాటించారు. రాజకీయాలకుతీతంగా మూసీ పునరుజ్జీవానికి కలిసి రావాలని పిలుపునిచ్చారు. 'కొంత మందికి పేదరికం ఎక్స్‌కర్షన్ లాంటిది. కానీ తమకు అలా కాదు. పేదరికం విలువ ఏమిటో నాకు తెలుసు' అన్నారు. అంబర్‌పేట మూసీ పరివాహక ప్రాంతాల పేదలకు పునరావాసం కల్పించేందుకు క్షేత్ర స్థాయిలో పర్యటించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఇన్‌ఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ఆదేశించారు. రాజకీయాలకు అతీతంగా అంబర్‌పేటను అభివృద్ధి చేసేందుకు తాను సిద్ధంగా ఉన్నట్టు తెలిపారు. హైదరాబాద్ నగరాన్ని అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేస్తామన్నారు. బతుకమ్మ కుంటకు వి.హన్మంతరావు పేరు పెట్టాలంటూ స్థానిక ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ సూచనమేరకు ఆ దిశగా ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

ఇదొక అద్భుతం ఘట్టం : హైడ్రా కమిషనర్ రంగనాథ్

బతుకమ్మ కుంట పునరుజ్జీవం వంటి అద్భుతం ఘట్టంలో హైడ్రా భాగస్వామి కావడం సంతోషకరమని హైడ్రా కమిషనర్ రంగనాథ్ చెప్పారు. బతుకమ్మ కుంట కబ్జాకు గురై మాయమైందన్నారు. కంపచెట్లు, బీర్ల బాటిల్, చెత్త, చెదారంతో నిండిపోయిందని చెప్పారు. ఇక్కడికి రావాలంటే మస్కులు పెట్టుకుని వచ్చే పరిస్థితులు ఉండేవన్నారు. బతుకమ్మ కుంట మొత్తం 16 ఎకరాల విస్తర్ణంలో ఉండేదనీ, ప్రస్తుతం ఐదెకరాల్లో మాత్రమే చెరువు పునర్జీవం పోసుకున్నదన్నారు. మిగతా భూమిలో పేదలు ఇళ్లు కట్టుకున్నారని ఉన్నారనీ, సిఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలమేరకు పేదల జోలికి పోలేదని చెప్పారు. రూ.50వేల కోట్ల విలువైన 900 ఎకరాల భూములను హైడ్రా రక్షించిందని చెప్పారు. కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క, జూపల్లి కృష్ణారావు, మాజీ ఎంపి వి.హనుమంతరావు, ఎంపి అనిల్‌కుమార్ యాదవ్, జిహెచ్‌ఎంసి మేయర్ గద్వాల విజయలక్ష్మీ, డిప్యూటీ మేయర్ శ్రీలత, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి రోహిన్ రెడ్డి ఉన్నతాధికారులతోపాటు పెద్ద సంఖ్యలో మహిళలు హాజరయ్యారు. ప్రజా గాయకులు విమలక్క, కనకవ్వ పాటలు పాడి అలరించారు. అనంతరం హైడ్రా రూపొందించిన ప్రత్యేక పాటను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆవిష్కరించారు.

నేడు సరూర్ నగర్ స్టేడియంలో మహా బతుకమ్మ

- గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సాధించే దిశగా పది వేలమందితో వేడుక

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ స్టేడియం మహా బతుకమ్మ వేడుకలకు సిద్ధమవుతోంది. గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకోవాలని లక్ష్యంగా సోమవారం పది వేల మందితో బతుకమ్మ వేడుకలను నిర్వహించనున్నారు. సాయంత్రం నాలుగు గంటలకు ప్రారంభం కానున్న ఈ వేడుకల్లో రాష్ట్ర మంత్రులు జూపల్లి కృష్ణారావు, కొండా సురేఖ, సీతక్క హాజరు కానున్నారు. తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎంబి వల్లూరి క్రాంతి, పర్యాటక శాఖ ఉన్నతాధికారులు ఆదివారం సరూర్‌నగర్ స్టేడియంలో జరుగుతున్న బతుకమ్మ ఏర్పాట్లను పర్యవేక్షించి సిబ్బందికి తగు సూచనలు చేశారు.

ముగ్గురు మంత్రులుండి గిరిజన కార్మికుల జీతాలు తగ్గిస్తారా?

- డిప్యూటీ సిఎం మల్లు, మంత్రి తుమ్మల కార్యాలయాలను ముట్టడించిన గిరిజన హాస్టల్ వర్కర్లు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉండి గిరిజన హాస్టల్స్ వర్కర్ల జీతాలు తగ్గించడం మంత్రుల వైఫల్యమే అని గిరిజన ఆశ్రమ పాఠశాలలు, హాస్టల్ డైలీ వేజ్ వర్కర్స్ యూనియన్ జెఎసి రాష్ట్ర కన్వీనర్ బి.మధు, నాయకులు బి.నాగేశ్వరరావు, గిరిజన సంక్షేమ శాఖ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర కార్యదర్శి కె.బ్రహ్మాచారి అన్నారు. జీతాలు తగ్గించే జిఒ 64ను, 527ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఖమ్మంలో హాస్టల్ డైలీ వేజ్ వర్కర్లు ఔట్‌సోర్సింగ్ వర్కర్లు భారీ ప్రదర్శన నిర్వహించి డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు క్యాంప్ కార్యాలయాల ఎదుట మూడు గంటల పాటు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎక్కడైనా ప్రభుత్వం జీతాలు పెంచాలి గాని కాంగ్రెస్ ప్రభుత్వం జీతాలు తగ్గించడం అన్యాయమని ఆగ్రహం వ్యక్తం చేశారు. డైలీ వేజ్ వర్కర్లకు టైం స్కేల్ అమలు చేయాలని, ఔట్ సోర్సింగ్ వర్కర్లకు జిఒ 60 ప్రకారం వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రజలంతా బతుకమ్మ, దసరా పండుగను జరుపుకుంటుంటే గిరిజన కార్మికులు పస్తులతో ఉండాల్సిన దుస్థితిని ప్రభుత్వం కల్పించిందని విమర్శించారు. ఉమ్మడి జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉండి గిరిజన కార్మికులను పస్తులతో ఉంచటం, జీతాలు తగ్గించడం ఏ రకమైన సామాజిక న్యాయమని ప్రశ్నించారు. కార్మికుల సమస్యలు పరిష్కారం చేయకుండా 18 రోజులుగా సమ్మె జరుగుతుంటే ప్రభుత్వం పట్టించుకోకుండా ఉండటం ప్రభుత్వ గిరిజన వ్యతిరేక వైఖరికి నిదర్శనమని అన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు నెలనెలా లక్షల్లో జీతాలు తీసుకుంటూ 10 నెలలుగా గిరిజన కార్మికులను పస్తులు ఉంచటం రాష్ట్ర ప్రభుత్వానికి తగునా అని ప్రశ్నించారు. 30 సంవత్సరాలుగా వెట్టి చాకిరీ చేయించుకుంటూ కనీసమైన హక్కులు కల్పించకపోవడం రాజ్యాంగ వ్యతిరేక చర్య అని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం చర్చలు జరిపి న్యాయమైన డిమాండ్లను పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. టైం స్కేలు అమలు చేయాలని, అప్పటివరకు జిల్లా కలెక్టర్ గెజిట్ ప్రకారం జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. గిరిజన కార్మికులకు జరుగుతున్న అన్యాయంపై ఉమ్మడి ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాలో ఉన్న గిరిజన ఎమ్మెల్యేలంతా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు తాళ్లూరి కృష్ణ, డైలీ వేజ్ వర్కర్స్ యూనియన్ జేఏసీ నాయకులు మంగీలాల్ వర్కర్లు పాల్గొన్నారు.

సామాజిక పోరాటాల్లోనూ సిఐటియు పాత్ర

- మెదక్‌లో డిసెంబర్ 7 నుంచి 9వ తేదీ వరకు రాష్ట్ర మహాసభ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సంఘటిత, అసంఘటిత కార్మికుల సమస్యలతో పాటు సామాజిక పోరాటాల్లోనూ సిఐటియు ప్రముఖ పాత్ర పోషిస్తోందని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు చుక్క రాములు, పాలడుగు భాస్కర్ అన్నారు. సిఐటియు 5వ రాష్ట్ర మహాసభలు డిసెంబర్ 7నుంచి 9వ తేదీ వరకు మెదక్ జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఆదివారం మెదక్ ప్రజా సంఘాల కార్యాలయం కేవల్ కిషన్ భవనంలో ఆహ్వాన సంఘం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 33 జిల్లాలు, 60 రకాల రంగాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న 1,000 మంది ప్రతినిధులతో డిసెంబర్‌లో మహాసభలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. మహాసభ మొదటి రోజు డిసెంబర్ 7న మెదక్ పట్టణంలో వేలాది మంది కార్మికులతో ప్రదర్శన, బహిరంగ సభ ఉంటుందని, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. మహాసభల నిర్వహణ కోసం ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులు, మేధావులు, ప్రజలు ఆర్థిక, హార్దిక, సహాయ, సహకారాలు అందించాలని కోరారు. 1970లో ఆవిర్భవించిన సిఐటియు నాటి నుంచి సంఘటిత, అసంఘటిత శ్రామిక జన ప్రయోజనాలకోసం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలపై నికరమైన పోరాటాలు నిర్వహిస్తోందని తెలిపారు. 1991లో సరళీకృత ఆర్థిక విధానాలు ప్రారంభమైన నాటి నుంచి ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణ, ధరల పెరుగుదల, కార్మికులు, ఉద్యోగుల అక్రమ తొలగింపుల నుంచి, నేటి పాలకులు అక్రమంగా తెచ్చిన లేబర్ కోడ్స్ వరకు.. కార్మిక వర్గానికి గొడ్డలి పెట్టులాంటి తప్పుడు విధానాలకు వ్యతిరేకంగా అనేక పోరాటాలు నిర్వహించినట్టు తెలిపారు. మున్సిపల్, గ్రామ పంచాయితీ కార్మికుల, హమాలీ, ట్రాన్స్పోర్ట్, భవన నిర్మాణంలాంటి అసంఘటిత కార్మికులను సంఘటిత పరిచేది ఒక సిఐటియు అని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వీరయ్య, మల్లికార్జున్, ఆహ్వాన సంఘం వైస్ చైర్మెన్ అడివయ్య, సిఐటియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బాలమణి, ఏ.మల్లేశం, జిల్లా కోశాధికారి నర్సమ్మ, ఉపాధ్యక్షులు మహేందర్ రెడ్డి, కడారి నాగరాజు, బస్వరాజు తదితరులు పాల్గొన్నారు.

బ్రెస్ట్ కేన్సర్‌పై అవగాహన కల్పించాలి

- సినీ నటులు బ్రహ్మానందం
- పాల్గొన్న మిస్‌వరల్డ్ ఓపల్ సుచాతా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బ్రెస్ట్ కేన్సర్‌పై మహిళలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని ప్రముఖ సినీ నటులు బ్రహ్మానందం అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని నెక్లెస్ రోడ్ పీపుల్స్ ప్లాజా వద్ద మేల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బ్రెస్ట్ కేన్సర్‌పై అవగాహన కల్పించడమే లక్ష్యంగా పింక్ పవర్ రన్ 2.0ను నిర్వహించారు. మిస్ వరల్డ్ ఓపల్ సుచాతా, తెలంగాణ పర్యాటక శాఖ ప్రత్యేక కార్యదర్శి జయేశ్‌రంజన్, హైదరాబాద్ కలెక్టర్ హరిచందనతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా బ్రహ్మానందం మాట్లాడుతూ విపరీతమైన ఒత్తిడి వల్ల కూడా బ్రెస్ట్ కేన్సర్ వస్తుందనీ, దీనిపై అవగాహన కల్పిస్తూ నిర్వహిస్తున్న కార్యక్రమంలో అనేక మంది ఉత్సాహంగా పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మేల్ ఫౌండేషన్ చైర్మన్ సుధారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్ ఉపఎన్నికకు పరిశీలకులను నియమించిన ఇసిఐ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జూబ్లీహిల్స్ ఉపఎన్నిక పర్యవేక్షణకు కేంద్ర ఎన్నికల సంఘం (ఇసిఐ) పరిశీలకులను నియమించింది. దేశవ్యాప్తంగా బిహార్ అసెంబ్లీ ఎన్నికలతో పాటు ఎనిమిది రాష్ట్రాల్లో జరగనున్న ఉపఎన్నికల కోసం మొత్తం 470 మంది సీనియర్ అధికారులను నియమించినట్టు కమిషన్ ప్రకటించింది. ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘం ఆదివారం ఒక ప్రకటన విడుదల చేసింది. పరిశీలకుల్లో 320 మంది ఐఎఎస్, 60 మంది ఐపిఎస్, 90 మంది ఐఆర్ఎస్ తదితర సేవలకు చెందిన వారున్నారని కమిషన్ వివరించింది.

దేశానికే ఆదర్శ గ్రామంగా 'కొండారెడ్డిపల్లి'

- ప్రతి ఇంటికీ ఉచిత సోలార్ ప్లాంట్
- దేశంలో రెండో గ్రామం, దక్షిణ భారత దేశంలో మొదటి గ్రామం
- సుమారు రూ.134 కోట్లతో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు శంకుస్థాపనలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సీఎం రేవంత్ రెడ్డి స్వగ్రామమైన కొండారెడ్డిపల్లిలోని ప్రతి ఇంటికీ, ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలకూ అన్నింటికీ ఉచితంగా సోలార్ ప్లాంట్లను ప్రభుత్వం ఏర్పాటు చేయడంతో గ్రామం విద్యుత్ స్వావలంబన సాధించి దేశంలోనే ఆదర్శ గ్రామంగా రూపుదిద్దుకుందని మంత్రులు దామోదర్ రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు, వాకాటి శ్రీహరి తెలిపారు. ఇదే కాకుండా మరికొన్ని అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభంతో కొండారెడ్డిపల్లి గ్రామం అభివృద్ధి దిశగా మరింత ముందడుగు వేస్తుందని అన్నారు. ఆదివారం నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గం వంగూరు మండలం కొండారెడ్డిపల్లి గ్రామంలో రూ.134 కోట్ల వ్యయంతో కూడిన పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్ రెడ్డి, ఎమ్మెల్యేలు డా.వంశీకృష్ణ, డా. కూచుకుళ్ల రాజేష్ రెడ్డి, డైరీ చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి, కొండారెడ్డిపల్లి అభివృద్ధి కమిటీ చైర్మన్ కృష్ణారెడ్డి, జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, జిల్లా ఎస్పి గైక్వాడ్ వైభవ్ రఘునాథ్‌తో కలిసి మంత్రులు పాల్గొని అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. మరి కొన్ని పనులకు శంకుస్థాపనలూ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజాసంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా సిఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ఇందిరమ్మ ప్రభుత్వం దేశానికే ఆదర్శంగా ముందుకెళుతుందని అన్నారు. రాష్ట్రంలో విద్య, వైద్య సేవలు, యువతకు నైపుణ్యాభివృద్ధి వంటి అంశాలకు రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. కొండారెడ్డిపల్లిలో 516 గృహాలు, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలు అన్నింటికీ రూ.10.53 కోట్ల వ్యయంతో సోలార్ విద్యుత్ ప్లాంట్లు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. గ్రామస్తులకు విద్యుత్ వినియోగంలో స్వాతంత్ర్యం కల్పించడమే కాకుండా ఆర్థిక ఆదాయాన్ని కూడా రాష్ట్ర ప్రభుత్వం కల్పించిందని అన్నారు. సోలార్ విద్యుత్ వల్ల పర్యావరణ పరిరక్షణ, ఆర్థిక ఆదాయంతో పాటు పునరుత్పత్తి శక్తికి కూడా దోహదం చేస్తుందని తెలిపారు. ప్రతి ఇంటి నుంచి నెలకు 360 యూనిట్లు విద్యుత్ ఉత్పత్తి అవుతుందని, దీంట్లో ఇంటి వినియోగానికి సుమారు 120 యూనిట్లు ఉపయోగిస్తే.. మిగిలిన విద్యుత్‌ను గ్రిడ్‌కు అనుసంధానం చేసినట్టు తెలిపారు. మిగిలిన విద్యుత్‌లో ప్రతి యూనిట్‌కు రూ.5.25

అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న మంత్రులు దామోదర్, జూపల్లి, వాకాటి

చెల్లించేందుకు విద్యుత్ పంపిణీ సంస్థ లబ్దిదారులతో ఒప్పందం కుదుర్చుకుందని అన్నారు. సెప్టెంబర్ నెలలో మొత్తం గ్రామం నుంచి సుమారు ఒక లక్ష యూనిట్ల విద్యుత్‌ను గ్రిడ్‌కు పంపారని, దాంతో గ్రామస్తులకి సుమారు రూ. ఐదు లక్షల ఆదాయం సమకూరిందని తెలిపారు. రాష్ట్రంలోనే తొలిసారిగా రూ.10.31 కోట్లతో వ్యవసాయ పంపుసెట్ల సోలరైజేషన్ కోసం శంకుస్థాపన చేశామని, అలాగే గ్రామంలో సోలార్ విద్యుత్ దీపాలు అమర్చేందుకు నిధులు కేటాయించినట్టు చెప్పారు.

రాష్ట్రంలో ప్రణాళికబద్ధంగా పలు అభివృద్ధి పనులను చేపడుతున్నట్టు మంత్రులు తెలిపారు. ప్రతి జిల్లాలో వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో మెడికల్ కళాశాలల ఏర్పాట్లతో పాటు డయాబెటిస్ సెంటర్లు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. రోడ్డు ప్రమాదాలు జరిగిన గంట (గోల్డెన్ అవర్)లోపు వైద్యం అందించే విధంగా ట్రామా సెంటర్లు ఏర్పాటు చేస్తామని అన్నారు. క్యాన్సర్ నివారణకు సిఎం అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని, క్యాన్సర్ చికిత్స కోసం ప్రత్యేక సెంటర్లు ఏర్పాటుకు కృషి చేస్తున్నట్టు తెలిపారు. గ్రామీణ ప్రాంతంలోని రైతులు పాడి పశువులను పెంపొందించుకునే దిశగా కృషి చేయాలని సూచించారు. అలాగే రూ.55 కోట్లతో కొండారెడ్డిపల్లి గేట్ నుంచి పోల్కంపల్లి వరకు రహదారి మెరుగుదల పనులు (భూసేకరణతో సహా), కొండారెడ్డిపల్లి ఓవర్ హెడ్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి పోల్కంపల్లి వరకు మిషన్ భగీరథ గ్రిడ్ పైప్‌లైన్ పనులు ప్రారంభించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులు, జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, జిల్లా అధికార యంత్రాంగం, గ్రామస్థాయి నాయకులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

రూ.3,849.10 కోట్లతో 39 ఎస్‌టిపిలు

- శంకుస్థాపన చేసిన సిఎం రేవంత్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ నగరంలో రూ.3,849.10 కోట్లతో కొత్తగా నిర్మించనున్న 39 సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ల (ఎస్‌టిపి)కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఆదివారం హైదరాబాద్‌లోని అంబర్‌పేటలో నిర్వహించిన కార్యక్రమంలో నగరంలో ఇప్పటికే పూర్తయిన పలు సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రితో పాటు పలువురు ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. రూ. 1878.55 కోట్లతో ప్యాకేజీ-1లో 16 ఎస్‌టిపిలు, రూ.1,906.44 కోట్లతో ప్యాకేజీ-2లో 22 ఎస్‌టిపిలు, రూ.64.11 కోట్లతో పిపిపి మోడల్‌లో ఒక ఎస్‌టిపి ఉన్నాయి. రూ.539.23 కోట్లతో నగరంలోని వివిధ ప్రాంతాల్లో సీవేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్లను నిర్మించారు. వాటిని ముఖ్యమంత్రి ప్రారంభించారు. వాటి వివరాలిలా ఉన్నాయి. రూ.319.43 కోట్లతో నిర్మించిన అంబర్‌పేట్, ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని 212.50 ఎంఎల్‌డి సామర్థ్యం గల అంబర్‌పేట్ ఎస్‌టిపి, రూ.109.24 కోట్లతో నిర్మించిన రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని 64 ఎంఎల్ డీసామర్థ్యం గల అత్తాపూర్ ఎస్‌టిపి ఇందులో ఉన్నాయి. రూ. 44.46 కోట్లతో నిర్మించిన కూకట్ పల్లి నియోజకవర్గ పరిధిలోని 25 ఎంఎల్‌డి సామర్థ్యం గల ముల్లకతువా ఎస్‌టిపి, రూ.34.13 కోట్లతో నిర్మించిన కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని 14 ఎంఎల్‌డి సామర్థ్యం గల శివాలయ నగర్ ఎస్‌టిపిలు అందుబాటులోకి వచ్చాయి. రూ.13 కోట్లతో నిర్మించిన కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని 10 ఎంఎల్ డీసామర్థ్యం గల వెన్నలగడ్డ ఎస్‌టిపి, రూ.18.97 కోట్లతో నిర్మించిన శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని 07 ఎంఎల్‌డీ సామర్థ్యం గల పాలపిట్ట ఎస్‌టిపిలు సేవలందించనున్నాయి.

మనువాదంపై మహోద్యమమే జాషువాకు నివాళి

- కె ఆనంద చారి, టి స్కైలాబ్ బాబు, భూపతి వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

మనువాదంపై మహోద్యమమే జాషువాకు నిజమైన నివాళి అని తెలంగాణ సాహితి రాష్ట్ర కార్యదర్శి కె ఆనంద చారి, కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి స్కైలాబ్‌బాబు, టిపిఎస్‌కె రాష్ట్ర అధ్యక్షులు భూపతి వెంకటేశ్వర్లు ఆదివారం గుర్రం జాషువా130వ జయంతి సందర్భంగా కెవిపిఎస్, తెలంగాణ సాహితి, తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో కెవిపిఎస్ మేడ్చల్ జిల్లా అధ్యక్షులు ఎం కృపాసాగర్ అధ్యక్షతన హైదరాబాద్ ట్యాంక్ బండ్‌పై ఉన్న జాషువా విగ్రహం వద్ద సభ నిర్వహించారు. వేల ఏండ్లుగా వేళ్లూనుకుని ఉన్న కుల,మత అసమానతలపై అక్షరయుద్ధం చేసిన నవయుగ చక్రవర్తి గుర్రం జాషువ వారు పేర్కొన్నారు. సామాజిక న్యాయాన్ని సమతా భావాన్ని నిర్మించిన మహాకవి జాషువా చిరస్మరణీయుడని తెలిపారు. తొలుత జాషువా విగ్రహానికి ఆనందచారి, స్కైలాబ్ బాబు, భూపతి వెంకటేశ్వర్లు పూలమాలలేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ భారతదేశ సామాజిక, సాహిత్య రంగంలో జాషువా కవిత్వం ఓ చైతన్య స్ఫూర్తి అని తెలిపారు. కుల, మత బేధాలు పేదరికం తన గురువుగా భావిస్తున్నానని చెప్పిన జాషువా వాటి మూలాలపై కలం యుద్ధం చేశారని పేర్కొన్నారు. కర్మ సిద్ధాంతం పేర కోట్లాదిమంది కష్టజీవులను అణిచివేత, దోపిడికి గురిచేసిన మనువాద విష సంస్కృతిపై మహోద్యమం నిర్మించాడని చెప్పారు. పాములకు పాలు పోసి, చీమలకు పంచదార చల్లే మనుషులున్న ఈ జగాన పేదవాడికి గంజి నీళు కూడా ఇవ్వరని తన కవిత్వం ద్వారా నిరసించాడని తెలిపార్లు. సామాజిక అసమానతలకు మూల కారణమైన సిద్ధాంతానికి ప్రతినిధులుగా ఉన్నవాళ్లు నేడు కేంద్రంలో అధికారంలో ఉన్నారని వారు ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిపిటిఎల్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ ఏ. విజయ్ కుమార్, తెలంగాణ సాహితి రాష్ట్ర నాయకులు అనంతోజు మోహన్ కృష్ణ, ఎస్.కె.సలీమ, శరత్ సుదర్శి, కేవీపీఎస్ గ్రేటర్ హైదరాబాద్ నగర కార్యదర్శి బి.సుబ్బారావు, మేడ్చల్ జిల్లా కార్యదర్శులు ఎన్ బాల పీరు, నాయకులు డి. రమేష్ , జి.రాములు, జి.విజయ్ కుమార్, బి.పవన్, సోమయ్య, సురేష్, విక్రమ్ పాల్గొన్నారు.

గ్రూప్-2 ఫలితాలు విడుదల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గ్రూప్ 2 ఫలితాలను తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టిజిపిఎస్‌సి) చైర్మన్ బుర్రా వెంకటేశం ఆదివారం విడుదల చేశారు. మొత్తం 783 పోస్టులకుగానూ ఎంపికైన 782 మంది జాబితాను వెల్లడించింది. ఒక్క పోస్టును కోర్టు కేసు కారణంగా పెండింగ్‌లో పెట్టారు. మొత్తం 18 క్యాటగిరీలకు సంబంధించి ఎంపికైన వారి జాబితాను టిజిపిఎస్‌సి వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్టు పేర్కొన్నారు. 2022లో గ్రూప్-2 నోటిఫికేషన్ విడుదల చేసిన టిజిపిఎస్‌సి 2024 డిసెంబరులో రాత పరీక్ష నిర్వహించింది. ఈ ఏడాది మార్చి 11న జనరల్ ర్యాంకుల జాబితాను వెల్లడించింది. అభ్యర్థులను ఎంపిక చేసి ఇప్పటికే సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియను పూర్తి చేశారు. తుది ప్రక్రియ ముగియడంతో ఈ గ్రూప్-2 ఉద్యోగాలకు సంబంధించిన తుది ఫలితాలను విడుదల చేశారు.

30న సద్దుల బతుకమ్మ

- సర్క్యులర్ జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో బతుకమ్మ పండుగ నిర్వహణపై ప్రభుత్వం క్లారిటీ ఇచ్చింది. ఎంగిలి పూల బతుకమ్మ నుంచి... లెక్క ప్రకారం తొమ్మిదో రోజు అయిన సెప్టెంబర్ 29 సోమవారం రోజున సద్దుల బతుకమ్మను నిమజ్జనం చేయాలని కొందరు అర్చకులు చెబుతున్నారు. మరోవైపు సెప్టెంబర్ 30న సద్దుల బతుకమ్మ నిర్వహించాలని మరికొందరు సూచిస్తున్నారు. గత కొద్ది రోజులుగా అర్చకుల్లో నెలకొన్న సందిగ్ధాన్ని రాష్ట్ర ప్రభుత్వం తొలిగించింది. ఈనెల 30వ తేదీ మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా సద్దుల బతుకమ్మ పండుగను జరుపుకోవాలని అధికారిక ఆదేశాలు జారీ చేసింది. ఈ సందర్భంగా అన్ని జిల్లాల కలెక్టర్లు, స్థానిక అధికారులు ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు సర్క్యులర్ జారీ చేశారు.

ఆగాల్సిందే.. అనుకూలమే

- స్థానికంపై హైకోర్టు కామెంట్ రేవంత్‌సర్కారుకు అస్త్రం
- హైకోర్టు సూచనల మేరకు నడుచుకోవాల్సిందే
- దాన్ని అడ్వాంటేజ్‌గా మార్చుకునే పనిలో రాష్ట్ర ప్రభుత్వం
- గవర్నర్ల వద్ద బిల్లులపై సుప్రీం తీర్పును అనుకూలంగా మార్చుకునే యత్నం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ రెండు, మూడు నెలలు ఆగితే నష్టమేంటి?' అన్న హైకోర్టు సూచనను రాష్ట్ర సర్కారు అడ్వాంటేజిగా మార్చుకునే పనిలో ఉంది. గవర్నర్ వద్ద బిల్లు పెండింగ్‌లో ఉంటే జిఒ చెల్లదనే విషయం రాష్ట్ర సర్కారుకు ముందే తెలుసు. కోర్టుల ముందు అది నిలవదనే సంగతీ తెలుసు. అయినా, ముందుకెళ్లింది. నోటిఫికేషన్ విడుదల కాని నేపథ్యంలో బిసి రిజర్వేషన్ల అమలుపై విచారణ చేయొచ్చంటూ హైకోర్టు అక్టోబర్ ఎనిమిదో తేదీ వరకు కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించిన సంగతి విదితమే. ఇవన్నీ అందరూ ఊహించినదే. ప్రస్తుతం గవర్నరు వద్ద బిసి రిజర్వేషన్లకు సంబంధించిన బిల్లు పెండింగ్ ఉన్నది. ఇది జరిగి నెల దాటింది. న్యాయసలహాల నిమిత్తం గవర్నర్ ఆ బిల్లును కేంద్ర హోం శాఖకు పంపారు. ఇటీవల రాష్ట్ర శాసనసభలు, మండళ్లు అసెంబ్లీల్లో బిల్లులు చేసి పంపినా పలు రాష్ట్రాల్లో ముఖ్యంగా బీజేపీయేతర పాలిత రాష్ట్రాల్లో గవర్నర్లు చట్టరూపం దాల్చకుండా మోకాలడ్డుతున్న విషయం విదితమే. కేరళ, తమిళనాడు రాష్ట్రాల్లోనైతే గవర్నర్ వర్సెస్ రాష్ట్ర ప్రభుత్వం అన్నట్టుగా ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. రాజకీయ దురుద్దేశంతోనే ఆ బిల్లులను అడ్డుకుంటున్నారని సుప్రీం కోర్టులో పిటిషన్లు సైతం దాఖలయ్యాయి. ప్రజలు ఎన్నుకున్న శాసనసభ్యులు రూపొందించిన బిల్లులను సహేతుక కారణాలు చూపెట్టకుండా ఏండ్లతరబడి పెండింగ్‌లో పెట్టడంపైనా సుప్రీం కోర్టు అభ్యంతరం వ్యక్తం చేసిన సంగతి తెలసిందే. ఒకవేళ గవర్నర్లు మూడు నెలలకుపైగా బిల్లులను పెండింగ్‌లో పెట్టుకుంటే రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకెళ్లొచ్చనే సంకేతాలను సుప్రీం కోర్టు ఇచ్చింది. అయితే, దీన్ని ప్రశ్నిస్తూ రాష్ట్రపతి కార్యాలయం సుప్రీం కోర్టుకు ఐదు ప్రశ్నలను సంధించిన సంగతి తెలిసిందే. స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసి రిజర్వేషన్లు 42 శాతం రిజర్వేషన్లు అమలు అంశంపై వేసిన పిటిషన్ విచారణ సందర్భంగా హైకోర్టు ఇదే అంశాన్ని లేవనెత్తింది. స్థానిక ఎన్నికల నిర్వహణ విషయంలో రెండు మూడు నెలలు ఆగితే నష్టమేంటి? గవర్నర్ వద్ద బిల్లు ఉండగా జారీ చేసిన జిఒ ఎలా చెల్లుబాటు అవుతుంది? ఈ విషయం ప్రభుత్వానికి తెల్వదా? హైకోర్టు సంధించిన సూటి ప్రశ్నలను రాష్ట్ర సర్కారు తనకు అనుకూలంగా మార్చుకుంటుందనే చర్చ రాజకీయ వర్గాల్లో నడుస్తున్నది. హైకోర్టు సూచన మేరకు రెండు, మూడు నెలలు ఆగి...అప్పటికీ గవర్నర్ బిల్లుకు ఆమోద ముద్ర తెలుపకపోతే జిఒ తీసుకొచ్చి ముందుకెళ్లే ఆలోచనలో రాష్ట్ర సర్కారు ఉంది. బిసిలకు రిజర్వేషన్లు కేటాయించడం బిజెపికి ఇష్టం లేదు కాబట్టే టెక్నికల్‌గా గవర్నర్ అడ్డు తగులుతున్నారనే ప్రచారాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలనే యోచనలో కాంగ్రెస్ పార్టీ ఉంది. బీజేపీని ఈ విషయంలో రాజకీయంగా ఇరుకున పెట్టే అవకాశం కూడా కాంగ్రెస్‌కు ఉంటుంది. ఇప్పుడున్న పరిస్థితుల్లో క్షేత్రస్థాయిలో యూరియా కొరత, భారీ వర్షాలతో పంట నష్టాలు, ఆరుగ్యారంటీల హామీలతో కొంతమేరకు కాంగ్రెస్‌కు ఇబ్బందికరంగా మారాయి. ఎట్లాగూ హైకోర్టు చేసిన సూచన మేరకు నడుచుకుంటూ జిపిలకు పెండింగ్ బిల్లుల క్లియరెన్స్, సంక్షేమ పథకాలను మరింత దూకుడుగా ప్రజల్లోకి తీసుకెళ్లి నష్టనివారణ చర్యలు చేపట్టాలనే ఆలోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉన్నట్టు ప్రచారం జరుగుతున్నది. వాస్తవానికి స్థానిక సంస్థల ఎన్నికలను ప్రభుత్వం ఏర్పడిన కొత్తలోనే పూర్తిచేస్తే కాంగ్రెస్ పార్టీ క్లీన్‌స్వీప్ చేసేదనే చర్చ రాజకీయవర్గాల్లో నడుస్తున్నది. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో ఆయన సిఎం కాగానే వెంటనే స్థానిక ఎన్నికలు నిర్వహించడంతో అదే రాజకీయ వేడిలో కాంగ్రెస్ పార్టీకి పూర్తిస్థాయిలో అనుకూల ఫలితాలు వచ్చిన విషయాన్ని ఎత్తిచూపుతున్నాయి. ఇలా జాప్యం చేసుకుంటూ పోతే రాజకీయంగా ఇబ్బందులు ఎదురవుతాయని, అవి వచ్చే శాసనసభ ఎన్నికల నాటికి ప్రభావం చూపుతాయనే చర్చ కూడా రాజకీయ వర్గాల్లో నడుస్తున్నది.

అను'మతిలేని' వైద్యం..!

- రోగుల ప్రాణాలతో చెలగాటం
- మితిమీరుతున్న శంకర్ దాదాల ఆగడాలు
- ఎటు చూసినా డయాగ్నొస్టిక్, ఎక్స్ సెంటర్లే
- రిజిస్ట్రేషన్ లేకుండానే నిర్వహణ
- సర్కార్ నిబంధనలు పాటించని వైనం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల్లో ప్రయివేటు ఆస్పత్రులు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. గల్లీకో ఆస్పత్రి ఏర్పాటవుతోంది. నిబంధనలకు విరుద్ధంగా యథేచ్ఛగా నిర్వహిస్తున్నారు. నిర్లక్ష్యపు మాటున పేదలను నిలువునా దోచుకుంటూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. శంకర్ దాదాల ఆగడాలు మితిమీరిపోతున్నాయి. ప్రయివేటు డయాగ్నోస్టిక్స్, క్లినిక్స్ ఆడిందే ఆట, పాడిందే పాటగా పరిస్థితి తయారైంది. వైద్య పరీక్షల పేరిట చేసే టెస్టులకు, ఫీజులకు నియంత్రణ లేకపోవడంతో శంకర్ దాదాలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఎలాంటి అనుభవం, అర్హత లేకుండా క్లినిక్‌ను ఏర్పాటు చేసి నిబంధనలకు విరుద్ధంగా రోగులను చేర్చుకుని చికిత్సలు చేస్తున్నారు. వచ్చీరాని వైద్యం చేస్తూ రోగుల ప్రాణాలు తీస్తున్నారు. హైదరాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు తనిఖీలు చేస్తూ, జరిమానా విధిస్తూ, మూసేస్తున్నా కొందరికి భయం లేకుండా పోతోంది.

కొందరితో అందరికీ చెడ్డపేరు..

కొందరు అత్తెసరు వైద్యులతో అందరికీ చెడ్డపేరు వస్తోంది. పవిత్రమైన వైద్య వృత్తికి కొందరు ఆర్ఎంపీలు, పీఎంపీలు మచ్చ తెస్తున్నారు. ప్రథమ చికిత్స చేయాల్సిన వారు డాక్టర్ల అవతారమెత్తి ప్రజల అవసరాలను ఆసరాగా చేసుకుని అమాయకుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. అనుమతి లేకుండా ఎక్కడపడితే అక్కడ ఇష్టారాజ్యంగా క్లినిక్‌లను నిర్వహిస్తున్నారు. పరిధిని మించి వైద్యం చేస్తున్న కొందరి వల్ల నీతి, నిజాయితీతో ప్రాథమిక వైద్యం చేసే వాళ్లకూ ఇబ్బంది వస్తోంది. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ లెక్కల్లో లేని మెజారిటీ క్లినిక్స్ మేడిపల్లి, బోడుప్పల్, ఉప్పల్, మల్లంపేట, కుత్బుల్లాపూర్, పాతబస్తీ, చార్మినార్ తదితర ప్రాంతాల్లో కొనసాగుతున్నాయి. ఓ వైపు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ, మరోవైపు ఎస్‌వోటీ పోలీసులు, ఇంకో వైపు తెలంగాణ వైద్య మండలి సభ్యులు వరుస తనిఖీలు చేస్తున్నా.. నకిలీ వైద్యులు ఏమాత్రం వెరవడం లేదు. యథేచ్ఛగా ఎంబీబీఎస్ వైద్యులుగా చెలామణి అవుతూ గుట్టుగా ఆపరేషన్లు, అబార్షన్లు చేసేస్తున్నారు. ఎప్పటికప్పుడు ఆయా క్లినిక్స్‌లో తనిఖీలు నిర్వహించాల్సిన డ్రగ్ కంట్రోల్ అధికారులు చూసీచూడనట్టుగా వదిలేస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. కాగా, ఎవరికైనా ఫిర్యాదు చేస్తేనే కానీ తనిఖీలు చేయడం లేదని ఆరోపణలు ఉన్నాయి.

ప్రమాదంలో ప్రజాస్వామ్యం

- ఇసి, దర్యాప్తు సంస్థలు స్వతంత్రంగా పనిచేయాలి
- హక్కుల రక్షణ కోసం దేశవ్యాప్త ఉద్యమం రావాలి
- దాన్ని యువత ముందుండి నడపాలి
- సుప్రీం కోర్టు సీనియర్ న్యాయవాది ప్రశాంత్‌భూషణ్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

దేశంలో ప్రజాస్వామిక హక్కులు హననానికి గురవుతున్నాయి. వాటిని కాపాడుకునేందుకు దేశవ్యాప్త ఉద్యమం జరగాలి. ఆ పోరాటాన్ని యువత ముందుండి నడపాలని సుప్రీం కోర్టు సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ పిలుపునిచ్చారు. ఆధివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో టిఎస్‌డిఎఫ్, జాగో నవతెలంగాణ ఆధ్వర్యంలో జస్టిస్ బి చంద్రకుమార్ అధ్యక్షతన 'ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకుందాం' 'ఎన్నికల కమిషన్, న్యాయవ్యవస్థ స్వతంత్రతను కాపాడాలి' అంశంపై సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వామపక్ష పార్టీల నేతలు, ప్రజాస్వామిక వాదులు పాల్గొని ప్రసంగించారు. ప్రశాంత్ భూషన్ మాట్లాడుతూ దేశంలో ప్రజల జీవన పరిస్థితులు అధ్వాన్నంగా ఉన్నాయని చెప్పారు. అవి మెరుగుపడాలన్నారు. మరో పక్క నిరుద్యోగం రోజురోజుకు పెరుగుతోందని చెప్పారు. వీటిని పరిష్కరించాల్సిన ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని విమర్శించారు.

శాశ్వత స్వభావం కలిగిన పనుల్లో తాత్కాలిక ఉద్యోగులను నియమించటం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులు, రైతులు, కూలీలు తమ సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు నిర్వహించాలని సూచించారు. మరో పక్క ప్రజాస్వామ్యానికి ప్రమాదం ఏర్పడుతోందని చెప్పారు. రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని ప్రభుత్వం డొల్లగా మారుస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ దశలో మోడీ మీడియాను కంట్రోల్ చేస్తున్నదని తెలిపారు.అయినా సోషల్ మీడియా ద్వారా మోడీ ప్రభుత్వ అప్రజాస్వామిక చర్యలు వెలుగులోకి వస్తున్నాయని చెప్పారు. మోడీ విధానాలు న్యాయవ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నదని, ప్రభుత్వం దాన్ని అదుపు చేస్తున్నదని వివరించారు.

సదస్సులో మాట్లాడుతున్న ప్రశాంత్ భూషన్

బాబ్రీమసీదు కేసులో తీర్పు చెప్పిన ఐదుగురిలో నల్గురికి పదవులు లభించాయని తెలిపారు.న్యాయమూర్తుల నియామకాల్లో సుప్రీం కోర్డు జడ్జి ఉండటాన్ని విస్మరించి, ఆ స్థానంలో క్యాబినెట్ మంత్రిని పెట్టటం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రభుత్వం కావాలనుకున్న వారే న్యాయమూర్తుల వుతున్నారని చెప్పారు. లడ్డాక్‌లో సోనంవాంగ్‌చూప్‌ను అరెస్టు చేయటం ప్రజాస్వామిక హక్కులను ఉల్లంఘించటమేనని తెలిపారు. ఇలాంటి స్థితిలో దేశవ్యాప్త ఉద్యమాలు అవసరమని చెప్పారు.

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ దేశం ప్రమాదకర పరిస్థితిలో ఉందన్నారు. మతోన్మాదం వేయి తలల నాగుపాములా ప్రజలపై బుసకొడుతున్నదని వివరించారు. దొంగలు రాజ్యాన్ని ఏలుతున్నారని విమర్శించారు. మతోన్మాదులు, కార్పొరేట్లు ఒక్కటయ్యి దేశాన్ని దోచుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. న్యాయవ్యవస్థ మలినమవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల కమిషన్ స్వతంత్రతను కాపాడటం అత్యవసరమని చెప్పారు. వామపక్ష ప్రజాతంత్ర శక్తుల ఐక్యత వల్ల మాత్రమే మతోన్మాద శక్తులను ఎదుర్కోగలమని తెలిపారు.

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ మాట్లాడుతూ ఆర్‌ఎస్‌ఎస్ సారధ్యంలో బిజెపి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన రాజ్యాంగ సంస్థలు నిర్వీర్యం అవుతున్నాయని చెప్పారు. ప్రజాస్వామిక హక్కులు, లౌకిక విలువలు దెబ్బతింటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల కమిషన్ వ్యవహారం వల్ల తమకు నచ్చిన వారికి ఓటు వేసే హక్కును కోల్పోతున్నామని తెలిపారు. మహారాష్ట్ర, కర్నాటక, బీహార్‌లో సర్ పేరుతో చేస్తున్న చర్యలే నిదర్శనమన్నారు. తమ మాట వినని రాజకీయ పార్టీలు, నాయకులపై ఇడి, సిబిఐ దాడులకు పాల్పడుతున్నదని చెప్పారు. ఇసిని తమ జేబు సంస్థగా మార్చుకున్నదని విమర్శించారు. రైతులు, కార్మికులు, ఉపాధి కూలీలు,నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించటంలో మోడీ ప్రభుత్వం విఫలమయిందని విమర్శించారు. దళిత, గిరిజన, మైనార్టీలు, బడుగు జీవులు సామాజిక పీడనకు గురవుతున్నారని చెప్పారు. తెలంగాణలో కూడా సర్ తీసుకొచ్చేందుకు జరుగుతున్న ప్రయత్నాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు మాట్లాడుతూ అనాగరిక, నరహంతక ప్రభుత్వం కేంద్రంలో మోడీ రూపంలో కొలువుదీరిందని విమర్శించారు. ప్రజాస్వామిక హక్కులగురించి అడిగే వారిని దేశద్రోహులుగా చిత్రిస్తున్నదని చెప్పారు. రాహుల్‌గాంధీ ఓట్ల చోరీపై చేసిన ప్రజెంటేషన్‌తో దేశం ఉలిక్కిపడిందని తెలిపారు. ఎన్నికల కమిషన్ మోడీ జేబు సంస్థగా మారిందని విమర్శించారు. కార్యక్రమంలో టిఎస్‌డిఎఫ్ కన్వీనర్ ప్రొఫెసర్ వినాయక్‌రెడ్డి, తెలంగాణ సాయుధ పోరాట యోధులు కందిమళ్ల ప్రతాపరెడ్డి, సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జెవి చలపతిరావు, ఎంసిపిఐ (యు) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వనం సుధాకర్, ఆర్‌ఎస్‌పి రాష్ట్ర కార్యదర్శి జానకి రాములు, సిపిఐ(ఎంఎల్) రాష్ట్ర కార్యదర్శి ప్రసాదన్న, ఆప్ అధ్యక్షులు దిడ్డి సుధాకర్, ఓట్‌సీడ్ గ్యారంటీ ఆర్గనైజేషన్‌నాయకురాలు సోగరా బేగం, శాంతి చర్చల కమిటీ నాయకులు దుర్గ ప్రసాద్, సుందరయ్య విజ్ఞాన కేంద్రం ట్రస్ట్ కార్యదర్శి ఎస్ వినయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

బొగత జలపాతం వద్ద పర్యాటకుల సందడి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ములుగు జిల్లా వాజేడు మండలంలోని బొగత జలపాతం పరవళ్లు తొక్కుతూ చూపరులను ఆకర్షిస్తోంది. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో ఛత్తీస్‌గఢ్ అటవీ ప్రాంతాల నుంచి వస్తున్న వరద నీటితో జలపాతం పరవళ్లు తొక్కుతోంది. జలపాతం అందాలను తిలకించేందుకు పలు ప్రాంతాల నుంచి వచ్చిన పర్యాటకులతో అక్కడి పరిసరాలు సందడిగా మారాయి.

గుంటూరులో అడ్వాన్స్‌డ్ గ్రోహెయిర్ అండ్ గ్లోస్కిన్ క్లినిక్ ఏర్పాటు

గుంటూరు : గుంటూరులోని లక్ష్మీపురం మెయిన్ రోడ్డులో డిప్యూటీ మేయర్ షేక్ సజీల అడ్వాన్స్‌డ్ గ్రోహెయిర్ అండ్ గ్లోస్కిన్ క్లినిక్‌ను ప్రారంభించారు. నిర్వాకులు నాణ్యమైన జుట్టు, చర్మ సంరక్షణ సేవలు అందించాలని ఆమె కోరారు. జీవనశైలి, కాలుష్యం వల్ల జుట్టు రాలిపోవడం, చర్మ సమస్యలు పెరుగుతున్నాయని, ప్రొఫెషనల్ చికిత్సలు అవసరమని చెప్పారు. క్లినిక్ ఆధునిక చికిత్సలు, యూఎస్ ఎఫ్‌డిఎ ఆమోదిత సాంకేతికతలతో సేవలు అందిస్తుందన్నారు. క్లినిక్ ఫౌండర్ శరణ్ వెల్ జే మాట్లాడుతూ.. ఇది భారత్‌లో 105వ బ్రాంచ్ అని, ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో 19 బ్రాంచ్‌లు ఉన్నాయని తెలిపారు. హెయిర్ ట్రాన్స్‌ప్లాంట్, పిఆర్‌పి, లేజర్ థెరపీ, గ్లుటాథియోన్ ఐవి, హైడ్రాఫేషియల్ వంటి సేవలతో పాటు ప్రీమియం వన్‌ప్రో ఉత్పత్తులు అందిస్తున్నట్లు చెప్పారు. ఉచిత కన్సల్టెన్సీ, అత్యుత్తమ నిపుణులతో కస్టమర్ సంతప్తి, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడం లక్ష్యమన్నారు. ఫ్రాంచైజీ పార్టనర్ భార్గవి గంజి, ఉన్నత ప్రమాణాలతో వెల్‌నెస్ సొల్యూషన్స్ అందిస్తామని, కస్టమర్ల ఆత్మవిశ్వాసాన్ని మెరుగుపరుస్తామని తెలిపారు.

గూడ్స్ రైలును ఆపిన సంగెం కలాన్ గ్రామస్తులు

- వరదనీటితో మునిగిన ఎస్‌సి కాలనీ
- చిట్టినాడు సిమెంటు కర్మాగారానికి రైల్వే ట్రాక్ ఏర్పాటుతో సమస్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తమ ఇళ్లల్లోకి వర్షాపు నీరు రావడానికి రైల్వే ట్రాకే కారణమని నిరసిస్తూ.. వికారాబాద్ జిల్లా తాండూర్ మండలం సంగెం కలాన్ గ్రామస్తులు ఆదివారం రైల్వే ట్రాక్‌పై కూర్చొని గూడ్స్ రైలును అడ్డుకున్నారు. తమ కాలనీ నీట మునిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. చిట్టినాడు సిమెంట్ కర్మాగారంకు కాలనీ పక్కన నుంచి రైల్వే ట్రాక్ ఏర్పాటు చేయడంతో ఈ సమస్య ఏర్పడిందని తెలిపారు. ఇటీవల కురుస్తున్న వర్షాలతో సుమారు 200 ఇళ్లు నీటమునిగాయి. దాంతో గ్రామస్తులు ఆగ్రహానికి గురై.. రైల్వే ట్రాక్‌పై బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమ గ్రామం మీదుగా చిట్టినాడు సిమెంట్ కర్మాగారం నిర్వాహకులు ఇష్టారాజ్యంగా రైల్వే ట్రాక్ వేసుకోవడంతోనే తమకు ఈ దుస్థితి ఏర్పడిందని అన్నారు. 13 ఫిల్లర్స్‌తో రైల్వే ట్రాక్ ఏర్పాటు చేసుకుంటామని చెప్పి, మూడు ఫిల్లర్స్‌తో ముగించినట్టు తెలిపారు. దాంతో ఎస్సీ కాలనీలోకి వరద వస్తుందని అన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధుల నిర్లక్ష్యంతోనే తమ కాలనీ మునిగిపోయిందని తెలిపారు. తమ కాలనీ పక్క నుంచి రైల్వే ట్రాక్ ఏర్పాటు చేయొద్దని గతంలో అప్పటి కలెక్టర్‌కు 40 సార్లు వినతి పత్రాలు అందజేసినా పట్టించుకోలేదన్నారు. ఇళ్లల్లోకి వరద నీరు చేరడంతో నిత్యవసర సరుకులన్నీ తడిసిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి తమ సమస్యలను పరిష్కరించాలని వారు కోరారు.

రైల్వే ట్రాక్‌పై బైఠాయించిన సంగెం కలాన్ గ్రామస్తులు

బతుకమ్మ పాటల్లో సామాజిక ఆర్థిక నేపథ్యం

ప్రజాశక్తి కల్చరల్

బతుకమ్మ పాటలు కేవలం కాలక్షేపం, దేవతలకు ఆరాధన మాత్రమే కాదని ఆ పాటల్లో సామాజిక ఆర్థిక నేపథ్యం ఉందని శాసన మండలి సభ్యులు దేశపతి శ్రీనివాస్ అన్నారు. రవీంద్ర భారతి సమావేశ మందిరంలో ప్రముఖ రచయిత్రి తిరునగరి దేవకీ దేవి రచించిన బతుకమ్మ గేయ సంకలనం ఆవిష్కరణ సభ జరిగింది ముఖ్య అతిథిగా దేశపతి శ్రీనివాస్ పాల్గొని సంకలనం ఆవిష్కరణ చేసి మాట్లాడారు సంకలనంలో పాటలు కుటుంబ పరమైన అనుబంధాలు ఆత్మీయత అనురాగాలు దేవకీ దేవి విశ్లేషించారు అని వివ రించారు బతుకమ్మ పాటలలో అంతరార్థాన్ని తెలుసుకుని పాడితే ఆ పాటలలో జీవం ఉంటుందని తెలిపారు ప్రముఖ సాహితీ పరిశోధకుడు సంగిశెట్టి శ్రీనివాస్ అధ్యక్షత వహించిన సభలో జూపల్లి సుభద్ర సంపుటిని విశ్లేషణ చేశారు సాహితీ వేత్త ఉదయవర్ల, జి దేవేందర్ పాల్గొన్నారు.

ఆస్ట్రేలియాలో ఘనంగా బతుకమ్మ వేడుకలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆస్ట్రేలియాలో బతుకమ్మ సంబరాలు వైభవోపేతంగా జరిగాయి. తెలంగాణ అసోసియేషన్ ఆఫ్ క్వీన్స్ ల్యాండ్ ఆధ్వర్యంలో బ్రిస్ బేన్ నగరంలో జరిగిన ఈ వేడుకలకు చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, అసెంబ్లీ మీడియా అడ్వయిజరీ కమిటీ చైర్మెన్ ఐరెడ్డి శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అక్కడ నివసిస్తున్న తెలంగాణ వాసులే కాకుండా ఇతర ప్రవాస భారతీయులు వేడుకలకు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బతుకమ్మ ఖ్యాతి ఖండాంతరాలు దాటడం తెలంగాణ సంస్కృతికి ఎంతో గర్వకారణమన్నారు. బతుకమ్మ వేడుకలను ఆస్ట్రేలియా వంటి దేశంలో నిర్వహించడం ఆనందంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ అసోసియేషన్ ఆఫ్ క్వీన్స్ ల్యాండ్ అధ్యక్షులు నరేందర్ కుమార్ చొల్లూరి, ఉపాధ్యక్షులు మాధవ రెడ్డి గుర్రం, కార్యదర్శి దయాకర్ బచ్చు, అసోసియేషన్ ప్రతినిధులు ఉమేశ్ వంగపల్లి, సంతోష్ రావు తదితరులు పాల్గొన్నారు.

టి-ఇపిసిఒఎ రాష్ట్ర గౌరవాధ్యక్షులుగా కొనగాల మహేశ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ ఈ-పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్స్ అసోసియేషన్ (టి-ఇపిసిఒఎ) రాష్ట్ర గౌరవాధ్యక్షులుగా, టిపిసిసి రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ కొనగాల మహేశ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం హైదరాబాద్‌లోని బేగంపేట్ టూరిజం ప్లాజాలో అసోసియేషన్ నిర్వహించిన కార్యవర్గంలో ఆయన్ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మహేశ్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ పంచాయతీ, తహసీల్దార్, ఎంపిడిఒ, డిపిఒ కార్యాలయాలల్లో 2015 నుంచి 1579 మంది ఇపిసిఒఎ పని చేస్తున్నారని తెలిపారు. కీలకమైన గ్రామ పరిపాలన, సంక్షేమ పథకాల అమలులో ఈ-పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్లుగా కీలకంగా బాధ్యతలను నిర్వహిస్తున్నారని తెలిపారు. బిఆర్‌ఎస్ ప్రభుత్వం పదేళ్ల కాలంలో వారిని నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం వారిని ఆదుకుంటుందన్నారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే గ్రీన్ చానల్ ద్వారా జీతాలను చెల్లిస్తున్నట్టు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క ప్రత్యేక చొరవతో వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు.

తెలంగాణ ప్రతిష్ట దేశ వ్యాప్తం చేసిన పైడి జయరాజ్

ప్రజాశక్తి కల్చరల్

భారతీయ చిత్ర పరిశ్రమలోకి తెలంగాణ ప్రాంతం నుంచి వెళ్లి అక్కడ తన నటన ప్రదర్శించిన పైడి జయరాజ్ తెలంగాణ ప్రతిష్ఠ దేశ వ్యాప్తం చేశారని భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు డాక్టర్ ఏనుగు నరసింహా రెడ్డి అన్నారు. రవీంద్ర భారతి లోని పైడి జయరాజ్ ఆడిటోరియం లో జయరాజ్ జయంతి వేడుకలు జరిగాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ నరసింహా రెడ్డి మాట్లాడుతూ పైడి జయరాజ్ టాకీ సినిమా వస్తున్న తరుణంలో నటుడు గా చిత్ర రంగంలో ప్రవేశించారని , దాదా సాహెబ్ ఫాల్కే అవార్డు అందుకున్న తొలి తెలుగు వారు అని చెప్పారు. పైడి జయరాజ్ కుటుంబ సభ్యులు కసారం రమేష్ , ఆకుల రావిందర్ , శ్రీనివాస్ సుధీర్ నాటక రచయిత దర్శకుడు ఖాజా పాషా తదితరులు పాల్గొన్నారు.

రెయిన్ బో 'అథ్లెటిక్ హార్ట్ క్లినిక్' ప్రారంభం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రెయిన్‌బో చిల్డ్రన్స్ హార్ట్ ఇన్‌స్టిట్యూట్ (ఆర్‌సిహెచ్‌ఐ) వరల్డ్ హార్ట్ డే పురస్కరించుకొని అథ్లెటిక్ హార్ట్ క్లినిక్ ప్రారంభించింది. క్రీడాకారులు, పిల్లల కోసం అత్యాధునిక గుండె సంరక్షణ సేవలను అందించడానికి ఈ ప్రత్యేక సదుపాయాన్ని ఏర్పాటు చేశారు. చురుకుగా ఉండే చిన్నపిల్లలలో గుండె సంరక్షణకు పెరుగుతున్న ప్రత్యేక అవసరాన్ని తీర్చాలని ఈ క్లినిక్ లక్ష్యంగా పెట్టుకుంది. ఈ కార్యక్రమాన్ని ప్యూర్ లిటిల్ హార్ట్స్ ఫౌండేషన్ (పిఎల్‌హెచ్‌ఎఫ్) సహకారంతో ఆర్‌సిహెచ్‌ఐలో నిర్వహించారు. ఈ కార్యక్రమం అనంతరం, కార్డియోపల్మనరీ ఎక్సర్‌సైజ్ టెస్టింగ్ పై ఒక ప్రాక్టికల్ వర్క్ షాప్ కూడా జరిగింది. నాగరాణి చావా, సుకృతి వేణి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించగా, రెయిన్ బో అథ్లెటిక్ హార్ట్ క్లినిక్ ను గోపీచంద్ పుల్లెల ప్రారంభించారు. ఈ సందర్భంగా హాస్పిటల్ డైరెక్టర్ డా. దినేష్ చిర్ల మాట్లాడుతూ, పిల్లలు చురుకైన జీవనశైలిని కొనసాగించేందుకు అత్యున్నత రోగ నిర్ధారణ, నివారణ సేవలను అందించడమే తమ లక్ష్యమని తెలిపారు. జాతీయ ఉత్తమ బాల నటి పురస్కార గ్రహీత సుకృతి వేణి మాట్లాడుతూ, తల్లిదండ్రులు పిల్లల గుండె ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని, క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు, సమతుల్య ఆహారం, చురుకైన ఆటలు దీర్ఘకాలిక ఆరోగ్యానికి కీలకమని పేర్కొన్నారు. పుల్లెల గోపీచంద్ మాట్లాడుతూ, గుండె జబ్బులపై అవగాహన పెంచాలని, క్రమం తప్పకుండా గుండె పరీక్షలు చేయించాలని సూచించారు.

కాంగ్రెస్, బిజెపి జాయింట్ వెంచర్

- బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాంగ్రెస్, బిజెపి పార్టీలు జాయింట్ వెంచర్ నడుపుతున్నాయని భారత రాష్ట్రసమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కెటిఆర్ విమర్శించారు. మంత్రి పొంగులేటి నివాసంలో ఇడి సోదాలు జరిగి ఏడాదైనా చర్యలు లేవన్నారు. కాంగ్రెస్, బిజెపి ఒకటేనని, రాష్ట్ర ప్రయోజనాలను ఆ రెండు పార్టీలూ కాపడలేవని ఆరోపించారు. మహబూబ్‌నగర్ జిల్లా కల్వకుర్తి మండలం కడ్తాల్‌లో ఆదివారం కేటీఆర్ పర్యటించారు. కడ్తాల్‌లో దీక్ష చేస్తున్న రైతులకు మద్దతు తెలిపారు. మాట ఇచ్చి.. తప్పిన కాంగ్రెస్‌కు స్థానిక ఎన్నికల్లో బుద్ధి చెప్పాలన్నారు. రేవంత్‌రెడ్డి మాట్లాడినంత హీనంగా ఏ సీఎం మాట్లాడలేదని అన్నారు. "రాష్ట్రం దివాళా తీసిందని సిఎం అంటే ఎవరు నమ్ముతారు? పాలమూరు, రంగారెడ్డిలో మిగిలిన 10శాతం పనులు పూర్తి చేయలేదు. ఆడబిడ్డలకు నెలకు రూ.2,500 చొప్పున రూ.55 వేలు బకాయిలు ఇవ్వాలి. ఓట్ల కోసం వచ్చిన కాంగ్రెస్ నేతలను బకాయిలపై నిలదీయాలి. ఓట్ల కోసం డబ్బులు ఇస్తే తీసుకొని.. మిగతా బకాయిల గురించి అడగాలి. ఆల్మట్టి ప్రాజెక్టును ఆపే దమ్ము రేవంత్‌రెడ్డికి ఉందా? లేదంటే గులాబీ దండు కదలాలా? ఆల్మట్టి ఎత్తు పెంపుపై రేవంత్‌రెడ్డి, రాహుల్ గాంధీ ఎందుకు మాట్లాడటం లేదు. రాష్ట్ర ప్రయోజనాలను కాపాడాలంటే మళ్లీ కెసిఆర్ రావాలి" అని కెటిఆర్ అన్నారు.ఔ

నెలల తరబడి బిల్లులు పెండింగ్

- గురుకులాలకు ఆహార పదార్థాలు ఎలా సరఫరా చేస్తారు?
- మాజీ మంత్రి హరీశ్ రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాంట్రాక్టర్లకు నెలల తరబడి బిల్లులు పెండింగ్ పెడితే వారు గురుకులాలకు ఆహార పదార్థాలు ఎలా సరఫరా చేస్తారని మాజీ మంత్రి, బిఆర్‌ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు ప్రశ్నించారు. ఈ మేరకు ఆదివారం ఆయన ట్వీట్ చేశారు. పిల్లలకు నాణ్యమైన భోజనం ఎలా అందించగులుగుతారు? అని ప్రశ్నించారు. కాంట్రాక్టర్లకు ఆరు నెలల నుంచి బిల్లులు పెండింగ్‌లో పెట్టి వారి కుటుంబాలకు బతుకమ్మ, దీపావళి పండుగలు చేసుకోకుండా చేయడం దుర్మార్గమన్నారు. విద్యార్థులు పస్తులుండకూడదని కాంట్రాక్టర్లు అప్పులు తెచ్చి భోజనాలు పెడుతున్నారని హరీశ్ రావు తెలిపారు. ఆ అప్పులు క్రమంగా పెరిగి, వారితో పాటు వారి కుటుంబ సభ్యులు ఆర్థిక భారంతో సతమతమవుతున్నారని చెప్పారు. 5 వేల మంది సరఫరాదారులు అధికారులకు గోడు వెళ్లబోసుకున్నా ప్రభుత్వంలో కదలిక లేదని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరిచి పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించి, పిల్లలకు నాణ్యమైన భోజనం అందేలా చూడాలని ఆయన డిమాండ్ చేశారు.

బోధన్ ఎన్‌ఎస్‌ఎఫ్‌పై ప్రభుత్వం సైలెంట్

- శ్రీధర్‌బాబు చైర్మన్‌గా కమిటీ వేసినా ముందడుగు లేదు
- ఎన్నికల ప్రచారాస్త్రంగానే సుగర్‌ఫ్యాక్టరీ
- పాదయాత్ర చేపట్టి తర్వాత పట్టించుకోని ఎంపి అరవింద్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'ఫ్యాక్టరీ పరిసరాల్లో చెరుకు లోడ్‌తో ఎడ్లబండ్లు, లారీలు. చుట్టుపక్కల కార్మికుల కదలికలు. ఫ్యాక్టరీ సముదాయంలో నిగనిగలాడుతూ చక్కెర రాశులు. పనుల కోసం వచ్చి వెళ్లే వారితో, వారి కోసం ఏర్పడ్డ దుకాణ సముదాయాలతో బోధన్ పట్టణం కళకళలాడుతుండేది'. గతం ఎంతో ఘనం అన్నట్టు.. సుగర్ ఫ్యాక్టరీకి లే ఆఫ్ ప్రకటించిన నాటి నుంచి వెలవెలబోతోంది. ఇప్పటికీ ఫ్యాక్టరీ కొనసాగితే, బోధన్ పట్టణంతో పాటు నిజామాబాద్ జిల్లా స్థాయి వేరేలా ఉండేదని స్థానికులు చెబుతున్నారు. ఫ్యాక్టరీని తెరిపిస్తామని ఎన్నికల సమయంలో హామీలు గుప్పించిన బిజెపి, బిఆర్‌ఎస్ తమ పదవీకాలంలో దాని గురించి పట్టించుకున్న దాఖలాలే లేవు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం తిరిగి తెరిపిస్తామని ప్రకటించి ఓ కమిటీని కూడా వేసింది. ప్రారంభంలో హడావుడి చేసి తర్వాత సైలెంట్ కావడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నిజామాబాద్ జిల్లా బోధన్‌లోని నిజాం సుగర్స్ ఫ్యాక్టరీ ఆసియా ఖండంలోనే అతిపెద్దదిగా పేరుగాంచింది. దీని పరిధిలో 16 వేల ఎకరాలు బోధన్ చుట్టుపక్కల ప్రాంతాల్లో ఉండేది. క్రషింగ్ ప్రారంభించిన తర్వాత నిత్యం 3,600 టన్నులు క్రషింగ్ చేసేవారు. ఉమ్మడి రాష్ట్రంలో చంద్రబాబు హయాంలో ప్రయివేటీకరించేందుకు నష్టాలనే సాకును ముందుకు తీసుకొచ్చి 2002లో ప్రభుత్వ, ప్రయివేటు భాగస్వామ్యంగా జాయింట్ వెంచర్‌లోకి వెళ్లింది. అంతవరకు 2,000 మంది కార్మికులు పని చేస్తుండగా ఒక్కసారిగా కార్మికులను 300 వరకు కుదించారు. చివరకు 2015 డిసెంబర్ 23న కార్మికులు, రైతుల ఆశలను తుంచుతూ లే ఆఫ్ ప్రకటించారు.

ఫ్యాక్టరీని వాడుకుంటూ రాజకీయాలు

బోధన్ సుగర్ ఫ్యాక్టరీ బంద్ అయినా దాని పేరుతో రాజకీయం మాత్రం నేటికీ కొనసాగుతూనే ఉంది. ఉద్యమ సమయంలో బిఆర్‌ఎస్ అధికారంలోకి రాగానే ఫ్యాక్టరీని స్వాధీనం చేసుకుంటామని ప్రభుత్వం ఆధ్వర్యంలోనే నడిపిస్తామని చెప్పగా.. ఆ పార్టీ అధికారంలో ఉన్న సమయంలోనే లే ఆఫ్ ప్రకటించడం గమనార్హం. అయినా ప్రారంభించేందుకు తీసుకున్న చర్యలు శూన్యమే. ఎంపి అరవింద్ 2018లో ఏకంగా 'చెరుకు రైతుల పరిరక్షణ' పేరిట పది రోజుల పాటు పాదయాత్ర చేపట్టారు. ఎంపిగా గెలిచిన నాటి నుంచి ఫ్యాక్టరీని పట్టించుకున్న పాపాన పోలేదు. రెండు పర్యాయాలు ఎంపిగా గెలిచినప్పటికీ ఫ్యాక్టరీ పునరుద్ధరణకు కేంద్రం నుంచి నయా పైసా తీసుకొచ్చిన దాఖలాలు లేవని రైతులు ఆరోపిస్తున్నారు.

కమిటీ పేరుతో కాలయాపన

2024 ఎన్నికల సమయంలో ఫ్యాక్టరీని పునరుద్ధరిస్తామని కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో ప్రకటించింది. అధికారంలోకి రాగానే ఐటి మంత్రి శ్రీధర్‌బాబు చైర్మన్‌గా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అధికారుల భాగస్వామ్యంతో 2024 ఫిబ్రవరి 4న కమిటీని ప్రకటించింది. ఆ కమిటీ అదే నెల 25న బోధన్ సుగర్ ఫ్యాక్టరీని సందర్శించి రైతులతో మాట్లాడారు. ఆ సమయంలో సైతం శ్రీధర్‌బాబు ఫ్యాక్టరీని పునరుద్ధరిస్తామని ప్రకటించారు. తదనంతరం 2025 జనవరి 4న ఎడపల్లిలో ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, భూపతిరెడ్డి, కలెక్టర్, అధికారులు చెరకు రైతులతో సమావేశం నిర్వహించారు. సాగుకు రైతులు ముందుకు వస్తే ఫ్యాక్టరీని ప్రభుత్వం పునరుద్ధరించనున్నట్టు ప్రకటించారు. ఆ తర్వాత ఇప్పటి వరకు ఫ్యాక్టరీ కోసం ఎలాంటి చర్యలూ తీసుకున్న దాఖలాలు లేవు.

భరోసా కల్పిస్తే సాగుకు రైతులు సిద్ధమే

ఫ్యాక్టరీ 2015 నుంచి పూర్తిగా మూసివేసి ఉండటంతో మిషిన్లు తుప్పు పట్టాయి. గట్టిగా పట్టుకొని లాగితే ఊడివచ్చేలా ఇనుము తుప్పు పట్టి ఉంది. తిరిగి క్రషింగ్ చేసేందుకు పనికివచ్చే స్థితిలో లేవు. రైస్‌మిల్ ఏర్పాటు చేసేంత స్థలంలో చెరుకు ఫ్యాక్టరీని నడిపించేలా ప్రస్తుత టెక్నాలజీతో అత్యాధునిక యంత్రాలు అందుబాటులోకి వచ్చాయి. వ్యయం కూడా తక్కువే అయ్యే అవకాశం ఉంది. చెరకు సాగుకు నాణ్యమైన సీడ్ ఇవ్వడంతో పాటు సబ్సిడీలు ప్రకటించి, సాగు చేసిన రైతులకు ప్రోత్సాహకాలు ప్రకటిస్తే మేలు. ఆ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకొని భరోసా కల్పిస్తే చెరకు సాగు చేసేందుకు రైతులు సైతం సిద్ధంగా ఉన్నారు. విధానపర నిర్ణయం తీసుకోకుండా ముందు సాగుచేయాలని చెప్పి తర్వాత పట్టించుకోకుంటే తమ పరిస్థితి ఏమి కావాలని రైతులు ప్రశ్నిస్తున్నారు.

చిరస్థాయిలో నిలిచే అవకాశం

కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో స్థానిక ఎమ్మెల్యే, మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి కృషి చేసి చెరకు ఫ్యాక్టరీని పునరుద్ధరిస్తే ఆయన కీర్తి చిరస్థాయిలో నిలిచే అవకాశం ఉంటుందని స్థానికులు పేర్కొంటున్నారు. ఫ్యాక్టరీ మూతతో బోధన్ ప్రాభవం కోల్పోయిందని.. తిరిగి తెరిస్తే.. వన్నె తెచ్చే వారవుతారని నియోజకవర్గ వాసులు అంటున్నారు.

మెట్‌పల్లి ఫ్యాక్టరీ నడిపిస్తే రైతులకు భరోసా: శ్రీనివాస్‌రెడ్డి, రైతు

బోధన్ చుట్టుపక్కల చెరకు సాగుకు అనువైన భూములున్నాయి. బోధన్‌లో ఉన్న ఫ్యాక్టరీ ఇప్పుడు తెరిపించినా క్రషింగ్ చేసేందుకు సమయం పట్టే అవకాశం ఉంది. ఈ సమయంలో దీని పరిధిలోని మెట్‌పల్లి ఫ్యాక్టరీని ప్రారంభిస్తే రైతులకు భరోసా కల్పించినవారవుతారు. అలా చేస్తే ఇక్కడి రైతులు చెరకు సాగు చేసేందుకు సిద్ధంగా ఉన్నారు. రైతులు సైతం వరికి ప్రత్యామ్నాయంగా చెరకు సాగు చేసేందుకు ఉత్సాహంగా ఉన్నారు.